

# పొరపాటు

ఇసుకపల్లి దక్షిణామూర్తి

**విమల ప్రేమకోసం రమణ, జోగారావు లిద్దరూ పోటీపడ్డారు. విమల తను రమణ జీవితంలోనికి అనవసరంగా తొంగిచూస్తోందా, అనుకున్నది.**

విమల పది గంటల బండికి వస్తోందని తెలిసి రమణ తొమ్మిది గంటలకే స్టేషను చేరాడు. ఆ గంటసేపు ప్లాటుఫారంమీద గడపటం చాల కష్టమైంది. పుస్తకాల దుకాణం దగ్గర, కిళ్లీకొట్టు దగ్గర పచార్లు చేస్తూ నిలబడ్డాడు. ఏ రైలు కూత కూసినా, ఏ గార్డు విజిలు ఊదినా, ఏ గూడ్సుబండి కదిలినా విమలే వస్తోందని నాగరాజు కోసం మల్లీశ్వరిలా 'కన్నుల సిరిడి' కలయ చూస్తూ నిలబడ్డాడు.

బండీ అరగంట లేటని తెలిసింది. దానితో రమణకు మరీ చికాకు ఎత్తింది. మళ్లీ ఆఫీసుకు పోవాలి. బండి తొందరగా వస్తే బాగుండును అనుకున్నాడు. కాలక్షేపణకోసం మాగజైను కొన్నాడు. అందులో ఏ కథమీద అతని మనసు లగ్నం కాలేదు. పుస్తకం మూసేశాడు. టీ తాగాడు. కిళ్లీ వేసుకున్నాడు. కిళ్లీ నములు తుంటే పొరపాటున నోట్లోనుంచి 'అమృతం' జారి బుష్‌కోటు మీద పడింది. తెల్లటి బుష్‌కోటుమీద ఎర్రటి చుక్క. చెరపబోయాడు. మచ్చలాగా అయింది. ఆపూటే ఇస్త్రీ చేసిన బట్టలు ప్రత్యేకంగా వేసుకువచ్చాడు. అదొక్క జతే అతని దగ్గర ఉన్నది. ఆఫీసు కయితే మాసిపోయిన బట్టలతో వెళ్లేవాడే. విమల వస్తోందని ఈ బట్టలు తీశాడు. మళ్లా వారం రోజులుదాకా ఆ బట్టలతోనే ఉండాలి. దానికి తోడు ఈ కిళ్లీతో ఎర్రటి మచ్చ గూడా పడింది. విమల చూసి నవ్వుతుందేమో! అప్పుడు ముఖం చిట్లించుకోగూడదు.

'చంద్రబింబంలాంటి నీ ముఖంమీద బొట్టు ఎంత అందమో ఇదీ .... అంతే .... ' అందా మనుకున్నాడు.

విమల తన వాక్చాతుర్యానికి మెచ్చుకుంటుంది.

అప్పుడు తను విమల వంక చూసి 'అదో రకంగా' నవ్వాలి. నవ్వచ్చు. కాని ....

విమలతోబాటు ఆమె తల్లి గూడా వస్తోంది. ఏమన్నా అనుకుంటుందేమో ! మరి ఇంకేదైనా సమాధానం చెప్పాలి. లేకపోతే ఆ మచ్చను చూడనట్లు నటించాలి. పక్క నిలువుటద్దంలో తన ప్రతిబింబాన్ని చూసుకున్నాడు. అంతపెద్ద మచ్చ కనపడుతుంటే తను చూడనట్లు ఎట్లా ఊరుకుంటాడు ? ఇంటిదగ్గరకు పోతే వేరే చొక్కా గూడా లేదు. పోనీ మాసిన చొక్కా తొడుక్కుంటే ! మచ్చ లేదుగా ! టైమేదీ .... బండి వచ్చేస్తూ ఉంటుంది. అద్దంలో మళ్లీ చూసుకున్నాడు. మచ్చ మరీ పెద్దదిగా కనిపించింది. జుట్టు రేగిపోయింది. జేబులో దువ్వెన లేదు. వేళ్లతో జుట్టు సరిచేసుకున్నాడు. సంతృప్తి కలగ లేదు. పావలా పెట్టి దువ్వెన కొన్నాడు. తల దువ్వుకున్నాడు.

ప్లాటుఫారంమీద గంట కొట్టారు. అతని గుండె దడదడ లాడింది. దూరాన సిగ్నలు అవతల పొగ కనపడింది. విమల ఆ బండిలో కూర్చుని పరుగు, పరుగున తన దగ్గరకు వస్తోంది. తన హృదయం ఆమె దగ్గరకు చేరాలని ఆరాట పడుతోంది. ఎక్స్‌ప్రెస్ అంటే బోలెడన్ని పెట్టెలు. ఏ పెట్టెలో కూర్చున్నదో ! కొంచెం ముందుగా పోయి అన్ని పెట్టెలు చూస్తే సరి. ప్లాటుఫారం మీదకు బండి పెద్ద పెట్టున చప్పుడు చేసుకుంటూ వచ్చేస్తోంది. రమణకు పక్కసారిగా తన నెవరన్నా చూస్తున్నారేమో నన్న సందేహం కలిగింది. చిరు చెమట పట్టింది, ఈ సమయంలో ఆ ఆలోచన లన్నీ ఎందుకు ? ఛీ .... అనుకున్నాడు. విమలను వెతుక్కుంటూ పెట్టె లన్నిటినీ వెయ్యి కళ్లతో చూడటం ప్రారంభించాడు.

బండి ఆగింది. రమణ హృదయచలనం గూడా ఆగినంతపనయింది. తనదగ్గరనుంచి రెండో పెట్టెలో....విమల మెల్లిగా దిగుతోంది. వెనకాలగా దిగుతున్న నడివయస్సు స్త్రీ ఆమె తల్లి కావచ్చు. జనాన్ని తోసుకుంటూ వాళ్ల దగ్గరకు పోయి పడ్డాడు. విమల ఇతన్ని చూసి ఆశ్చర్యం ప్రకటించింది. 'ఓ .... మీరు వచ్చారా .... ' అంది. రమణ గొంతు ఆరిపోయింది. వాళ్లిద్దరినీ నవ్వించేట్లుగా ఏదన్నా హాస్యంగా సమాధానం ఇద్దామనుకున్నాడు. సరియైన మాటలు దొరకలేదు.

"అమ్మా .... నేను ఆఫీసులో చేరటంలేదూ.... రమణారావుగారని .... అక్కడే పనిచేస్తుంటారు...' అంటూ తల్లికి ఆయన్ని పరిచయం చేసింది. రమణ నమస్కరించాడు. ఆమె తెల్లబోయి, "తన కంటె చిన్నవాడైన అతనికి నమస్కరించాలా, వద్దా అన్న విషయం తెముల్చుకోలేక చేతులు కలిపి కిందకు వదిలేసి, ముఖం వికారంగా నవ్వుతున్నట్లు పెట్టి 'ఆహా .... అట్లాగా' అంటూ నసిగింది. రమణ అప్పటికీ గొంతు విప్పలేదు.

"మీరు వచ్చారు కాబట్టి సరిపోయింది .... ఇంత సామానుతో ఇంటికి చేరటం ఎట్లాగా అని భయపడుతున్నాను" అంది విమల. రమణ పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారయింది. తను ఈ సామాన్లన్నీ మోసుకుపోవటానికని వచ్చాడా ? ఆ మాటకి సమాధానం దొరకలేదు.

'అబ్బే .... దానికేం .... ' అన్నాడు.

'కూలీ .... ' అంటూ విమల కేక వేసింది. ఇద్దరు, ముగ్గురు కూలీలు వచ్చారు. సామానంతా చూపింది. అంతా స్టేషను బయటకు వచ్చారు. రమణ కూలీ డబ్బు రెండు రూపాయలు ఇచ్చేశాడు. విమల అక్కడ లేకపోతే తను బేరం చేసి రూపాయికి అంత సామానుకుదిర్చేవాడే ! కిమ్మనకుండా రెండు రూపాయలు ఇచ్చేశాడు ఇప్పుడు.

'మీకు రెండు రూపాయలు వదిల్చాను' అంది విమల. రమణ ముఖం మరొక్కసారి పాలిపోయింది. "విమల 'థాంక్సు' అంటుంది. 'ఆ .... ఈమాత్రాని కేమిటిలెండి' అందా మనుకున్నాడు రమణ.

'ఆ వదిల్చే దేమిటి .... కూలి ఇవ్వద్దా' అన్నాడు. ఆ మాట అతని చెవులకే కర్కశంగా వినిపించింది. విమల ఏమనుకుందో ! ఆమె ముఖంలో ఎటువంటి మార్పులు కనపడలేదు

విమల బాగా అలిసిపోయినట్లు ఉంది. ముఖం వాడిపోయి ఉంది. రేగిపోయిన జుట్టు, నలిగిపోయిన బట్టలు. రమణ కవేమంత కనపడలేదు.

విమల ఈ వేషంలో గూడా ఎంత అందంగా కనపడుతోంది ! అనుకున్నాడు.

రిక్షాలు మాట్లాడాడు.

విమల ఇల్లు చేరింది.

భోజనాలు ముగించుకున్న తర్వాత, విమల ఆఫీసుకు బయలుదేరుతూంటే 'కొత్తచోటు .... జాగ్రత్తమ్మా' అని చెప్పింది విమల తల్లి యశోద. విమల నవ్వేసి వెళ్లిపోయింది.

రమణ ఆఫీసులో కనపడ్డాడు. విమల నమస్కరించింది. తన కయిన పరిచయంతో, ఆడపిల్లకు ఇంక నమస్కారం పెట్టే అవసరం లేదనుకున్నాడు రమణ. 'రండి .... రండి .... ' అన్నాడు. విమల నవ్వుతూ వచ్చింది. నవ్వట మనేది విమల ప్రకృతిలోనే ఉందనిపిస్తుంది. ఆమె సోగకళ్ళు, చెక్కిళ్లు, పెదిమలు, సన్నగా తేలిన ముక్కు.... అన్నీ నవ్వుతున్నట్లుగానే ఉంటాయి. రమణకు మాత్రం ఆ నవ్వులో అనేకమైన అర్థాలు. అంతరార్థాలు.

'ఏమండీ .... ఆఫీసు వాతావరణం ఎలా ఉంది' అని అడిగాడు. 'అంతా కొత్తగా ఉంది .... ' అంది విమల.

'మీకేమన్నా తెలియకపోతే నన్నడుగుతూ ఉండండి' అన్నాడు రమణ. 'ఏ విషయంలో' అంటూ నవ్వింది విమల.

ఇదే అదను అనుకున్నాడు రమణ తన పురుషత్వం చూపించుకోవటానికి. 'ఏ విషయంలోనైనా సరే' అన్నాడు. విమల ఏమిటో అర్థం చేసుకున్నట్లుగా తలవూపి వెళ్లిపోయింది.

రమణ ఆ సాయంత్రం విమల ఇంటికి వెళ్లాడు. విమల ఇంట్లో లేదు. కూరలు తేవటానికి పోయింది. యశోద లాంతరు వెలిగిస్తోంది. 'రా నాయనా' అంటూ పిలిచింది. 'ఆ పీటమీద కూర్చో బాబూ' అంది.

రమణ విమలకోసం గాలించటం యశోద కనిపెట్టి 'మగదిక్కులేని సంసారం నాయనా .... సిగ్గు విడిచి దాని రెక్కల కష్టంమీద బతకటానికని వచ్చాను...నాకు చావైనా రాదు .... ' అంది. లాంతరు వెలుతురు గది అంతా వ్యాపించింది. యశోద కళ్లల్లో మెరమెర చూచాడు రమణ.

'అసలు సంధ్యవేళ ఆ వేం మాటలండీ' అన్నాడు.

'నా అదృష్టానికి ఇంకా ఎటువంటి మాటలు వస్తాయి నాయనా .... అదుగో...వస్తోంది' అంటూ వాకిట్లోకి చూసింది యశోద.

విమల సంచినిండా కూరలతో వస్తోంది.

'ఎప్పుడు వచ్చారు .... '

(44-వ పేజీ చూడండి)

మొదలకుండా ఇంట్లోకి వచ్చి కూర్చుంది.

'ఇవ్వాళ సినిమాకు పోదాం' అంటూ రమణ వచ్చాడు.

'అనుకుంటూండగానే వచ్చావు .... రా .... నాయనా' అంటూ యశోద ఆహ్వానించింది.

"చాలా మంచి సినిమానండి ...." అంటూ రమణ సినిమాకు పోవలసిన ఆవశ్యకతను గూర్చి చెప్పబోయేటప్పటికి యశోద అందుకుని 'అట్లాగే పోయిరండి' నాయనా" అంది. రమణ నోరు కట్టుబడింది. విమల వెంటనే బయలుదేరింది. తన ఆలోచనల బరువునుండి ఈరకంగానైనా తప్పించుకోవచ్చు ననుకుంది.

ఇంగ్లీషు సినిమా అది. రెండు రూపాయల టిక్కెట్లకు వెళ్లారు.

విమల సినిమా చూస్తోంది. రమణ విమలను చూస్తున్నాడు. సినిమా అయిపోయింది.

'ఎట్లాఉంది' అని అడిగింది విమల.

'బావుంది' అన్నాడు రమణ. 'ఏది బావుంది' అన్న ప్రసక్తి రాలేదు. రమణ సినిమా చూడ లేదని విమల గ్రహించినా, తను గ్రహించి నట్లుగా కనబడదలచుకోలేదు.

"ఇంటికి పోదామా" అంది విమల.

'నీ యిష్టం' అన్నాడు రమణ. 'కాసేపు బజా రులో తిరిగి వద్దాం' అంటే విమల 'సరే' అంటా దనుకుంది. చంద్రుడు అప్పుడే పైకి వస్తు న్నాడు. నక్షత్రాలు ఆహ్వానిస్తున్నాయి. చల్లటి గాలి వీస్తోంది. బరువుగా అడుగులు వేస్తూ ఇంటికి చేరుకున్నారు..

మర్నాడు ఆఫీసులో సరళ కలిసింది. సరళ నవ్వు తోంది. విమలకు అసహ్యంగా తోచింది.

'సినిమా ఎట్లా ఉంది' అని అడిగింది సరళ. విమల కంతా అర్థమయింది.

'బాగానే ఉంది' అంది విమల.

'అదృష్టవంతురాలివి .... బాగుండక ఏం చేస్తుందిలే' అంది సరళ. 'నోరు ముయి' అంది విమల ఆగ్రహం.

'ఎవరినోరు' అంటూ ఆగకుండా వెళ్లిపోయింది సరళ.

'నీ నోరు మూయిస్తాను .... చూస్తూఉండు' అంటూ పళ్లు పటపట కొరికింది.

'కంగ్రాచ్యులేషన్స్ రమణా' అన్నాడు జోగారావు.

'ఏమిటి విశేషం' అన్నాడు రమణ.

'ఏంలేదులే గాని .... సినిమా ఎట్లాఉంది ....'

రమణ అతనివంక తీక్షణంగా చూశాడు.

నేనేమన్నా గుడ్డికొంగనురా .... మాడిపోవ టానికి. అట్లా చూస్తా రెందుకు.' అన్నాడు జోగారావు.

'ఇదే ఇంకోళ్లయితే దవడ పగులగొట్టేవాడిని.'

'నీచేత దెబ్బలు తింటానికి ఎవరూ తయారుగా లేరు గాని .... ఇదేం పోయేకాలంరా నీకు.'

సినిమాకు వెళితే మీరంతా ఇట్లాపడి ఏడుస్తా రెందుకు ...."

'మేమంతా సంతోషిస్తున్నాంరా నా తండ్రీ .... అహ .... ఏంలేదు .... అటు పోయేటప్పుడు కేక వేస్తే నేనుగూడా వచ్చేవాడినిగా ?

'ఈసారి పిలుస్తాలే ....'

'నువ్వు ఒక్కడవు వెళ్లేటప్పుడు కాదు .... విమల గూడా పక్కనుంటేనే ....'

రమణ ఏదో అనబోయాడు. విమల అక్క డకు రావడం చూచి ఆగిపోయాడు.

'నమస్కారమండీ' అన్నాడు జోగారావు గౌరవ చేసుకుని.

'ఈయన జోగారావుగారు .... నా స్నేహితుడు.' పరిచయం చేశాడు. 'నమస్తే' అంది విమల.

'సరే .... నేను వస్తాను' అన్నాడు జోగారావు. రమణ చికాకుపడ్డాడు.

'కూర్చోవోయి పోదువుగాని' అన్నాడు.

'కాదులే...' అంటూ వెళ్లిపోయాడు జోగారావు. అతను నవ్వటం విమల చూసింది.

సరళ అన్న మాటలనుగురించి మాట్లాడుదా మనుకుంది విమల. జోగారావుగురించి ప్రస్తా విద్దా మనుకున్నాడు రమణ.

ఒకళ్లను చూస్తూ ఒకళ్లు చాలాసేపు మవు నంగా కూర్చున్నారు. ఇద్దరూ ఎంతో దగ్గరగా ఉన్నారు. ఎంతో దూరంగా ఉన్నారు.

'నా మనసెంతో ఆందోళనగా ఉంది.' అన్నాడు రమణ.

'నాకూ అట్లాగే ఉంది' అంది విమల.

కాగితాలు సర్దేసి ఇద్దరూ బయటపడ్డారు.



పొద్దు కూకుతోంది. కొండల వెనుకకు పోయిన సూర్యుని కిరణాలు మేఘాలమీద ప్రతిఫలిస్తుంటే ఆకాశమంతా తైలవర్ణ చిత్రంలాగా కనపడుతోంది. అవేవో పిట్టలు బారులుతీరి పోతున్నాయి. ఆ బారు వెనుక రెండు పిట్టలు మాత్రం కొంచెం దూరంగా ఎగురుతున్నాయి.

ప్రకృతి ప్రశాంతంగా ఉంది. చెట్ల ఆకులు నిశ్శబ్దంగా అటూ యిటూ కదులుతున్నాయి.

పార్కుకి వెళ్లారు. అంతా జనసమూహం. మూలగా వెళ్లి ఎవరూ లేనిచోట ఒక బల్లమీద కూర్చున్నారు. దగ్గరలో గులాబీ అంట్లున్నాయి. రమణ మెల్లిగా లేచి ఒక పువ్వు కోసుకుని వచ్చాడు. ముల్లు చేతికి గుచ్చుకుంది.

'ఈ పువ్వు నీకు బావుంటుంది.' అన్నాడు రమణ. మెల్లిగా పక్కకు వచ్చి కూర్చుని తలలో పెట్టాడు.

ఆ చెట్టుమీద ఉంటే పువ్వు కేమిటి అందం?' అన్నాడు రమణ. అతను నవ్వబోయాడు. అతని మనసులో కలిగిన ఉద్వేగం స్వచ్ఛంగా నవ్వనీయ లేదు. ముఖం కొద్దిగా కందింది. శరీరం అంతా గగుర్పాటు చెందింది.

'ఏమిటి ఆలోచిస్తున్నావు ....' రమణ అడి గాడు. విమల చేతిని తన చేతిలోకి తీసుకుని తామర పూలవంక చూస్తూ. గాలికి తామరపూలు ఒక పక్కకు జరిగిపోయి మళ్లా యధాస్థానానికి వస్తు న్నాయి. ఏవో పురుగులు నడుస్తూంటే నీటి శరీరం జలదరించినట్లు కనిపిస్తోంది. ప్రశాంత తను భగ్నం చేస్తూ ఎక్కడో పిట్టలు అరు స్తున్నాయి.

'నువ్వంటే నాకు ఎంతో ఇది' అన్నాడు రమణ. విమల కళ్లు చమరించినాయి. అతని హృదయం మీదికి వాలిపోయింది.

'నాకు భయంగా ఉంది' అంది.

'ఎందుకు భయం.'

'నాకు తెలియదు ....' విమల శిరస్సు తన గుండెలమీద బరువుగా ఉంది రమణకు. తలలో గులాబిరేకులు రెపరెప లాడుతున్నాయి.

'వాన కురుస్తుందా ....'

'ఉహూ ....'

'కురుస్తే బాగుండును."

'అవును.'

'ఇవాళ ఎండ బాగా కాసింది.'

'నిజమే.'

రమణ మాటలకి పొడి సమాధానాలు చెప్తోంది విమల. 'కుంభవృష్టి కురుస్తే బాగుండును' అను కుంది.

'ఇంటికి పోదామా ....'

'తొందరేముంది' అన్నాడు రమణ.

'అమ్మ ఎదురు చూస్తుంటుంది.'

'మీఅమ్మ నా గురించి ఏమనుకుంటోంది.'

'దేనివిషయం....'

'నన్ను ఏమన్నా అనుమానంగా చూస్తోందా.'

'అనుమానం ఎందుకు....'

ఆమె పెదిమల మలుపులో మెరపులాగా వచ్చి పోయిన మందహాసం రమణ కళ్లదాకా రానేలేదు. విమల లేచి నిలబడింది. ఇద్దరూ బయటకు బయలుదేరారు. విమల నిరుత్సాహంతో నీళ్లు కారిపోయింది. ఆమె ఎన్నో విషయాలు మాట్లాడ వచ్చు ననుకుంది. ఆమె హృదయం మబ్బుల అంచుల్లో ఎగిరే పావురంలాగా ఊహించుకుంది. కాని ఆ విహంగం విహారానికే బయలుదేరలేదు. పార్కు బెంచిమీద నీళ్లు కారిపోతూ రెక్కలు కట్టేసుకుని పడిఉంది. 'రమణ చాలా పెద్దమనిషి' అంటూ విమల తల్లి ఎప్పుడో అన్న మాటలు గుర్తుకు వచ్చినాయి. 'మరీ ఇంత పెద్దమనిషేమిటి' అను కుంది విమల.

ఇద్దరూ నిశ్శబ్దంలో అడుగుల చప్పుడు చేస్తూ ముందుకు సాగిపోతూంటే కింద పరుచు కున్న వెన్నెలమీద నీడలు నడిచిపోతున్నాయి. గులాబి సౌరభం వెంటాడి వస్తోంది. ఇద్దరూ దిగు లుగా ఉన్నారు. కాని రమణ మనస్సులో అదొక రకమైన 'శాంతి' లాంటి ఆవేశం ఆవహించింది. తను చూపిన నిగ్రహం ఇంకోళ్లు చూపలేరు. విచ్చలవిడిగా మనస్సును, శరీరాన్ని వదిలి పెట్టడంకంటే ఆ దుఃఖంలో ఉంచుకోవటంలోనే అందం ఉంది. తనలో ఉన్న ఆకర్షణ గూడా అదే నేమో ! రమణ గుండెసైజు పెరిగింది. తన హృదయం విశాలమైంది. దీర్ఘంగా గాలి పీల్చాడు. మనసు తేలికైంది. విమల గూడా దీర్ఘంగా గాలి పీల్చింది. హృదయం, మనసు బరువై మనిషి వంగి, వంగి నడుస్తోంది.

'అమ్మో' అంటూ కేక వినబడింది. పక్క నుంచే వచ్చింది ఆ కేక. అదిరిపడ్డారు ఇద్దరూ. పక్కనే గుబురుగా పెరిగిన పరివిచెట్లలో నుంచి

తప్పింది అరుపు. గబగబా అటువైపు వెళ్లారు. జోగారావు క్రిందపడి దొర్లుతున్నాడు. ఇద్దరూ ఒక్కసారే గుర్తుపట్టారు. 'పాము .... పాము ....' జోగారావు రొప్పుతున్నాడు.

'ఎక్కడ....'

'అటుపక్కకు పోయింది....'

రమణ ఆత్రుతగా 'అటుపక్కకు' చూశాడు.

కన్నం చివర తోకలాగా కనబడింది. జోగారావు కిందపడి దొర్లుతున్నాడు. చుట్టుపక్కల

# పొరబాటు

ఎవరూ లేరు. రమణ కేకవేసి చూశాడు. ఎవరూ పలకలేదు.

'కాలుమీద కరిచి పారిపోయింది' జోగారావు మడమ పట్టుకుని చూపించాడు. 'మా ఇల్లు చాలా దూరం .... మీ ఇంటికి తీసుకుపో రమణా .... మంత్రం వేస్తారేమో .... డాక్టరుని పిలుస్తావా.... మీ ఇల్లు ఎంతదూరం .... తొందరగా చెప్పు రమణా' జోగారావు ఆదుర్దా చూస్తుంటే రమణ ఆదుర్దా అంతకు నాలుగు రెట్లుగా ఉంది.

'రిక్షామీద పోదాం ....' అన్నాడు రమణ.

'మా ఇల్లు ఇక్కడేగదా .... అక్కడికి పోదాం' అంది విమల.

'ముందు రిక్షాదాకా పోవటం ఎట్లాగు' అన్నాడు జోగారావు. రమణ అతన్ని లేవదీశాడు. జోగారావు వేళ్లాడిపోతున్నాడు. షుమారు ఆరడు



గుల మనిషి. రమణ వీపుమీదకు ఎత్తుకోలేక పోయాడు.

'ఎట్లా .... ఆలస్యం అయితే ఏమవుతుందో' అంటున్నాడు జోగారావు. ఆపత్సమయం గుర్తించింది విమల. తను గూడా సాయం పట్టింది. ఇద్దరి భుజాలమీద చేతులు వేసుకుని కాళ్ళు వేళ్ళాడేస్తున్నాడు జోగారావు. జోగారావు చేతిలో నలిగిపోతోంది విమల. అంత బరువు మోయలేదు. లేకపోతే ప్రాణానికే మోసం వస్తుందేమో! ఎవరన్నా చూస్తే! ఏమనుకుంటారు. సాటి ప్రాణాన్ని రక్షించటానికి ముందుకువచ్చిందనుకుంటారు. తను స్త్రీ!! స్త్రీ పురుష భేద ప్రసక్తి ప్రాణాపాయ సందర్భంలో రాదు. కాని తను మోయలేని బరువు అలాగే బలవంతాన గేటుదాకా వచ్చారు. విమల మనసు తేలికైంది.

'మీ ఇల్లు దూరం .... మా ఇంటికే పోదాం' అంది విమల. రిక్షాలు మాట్లాడారు. ఇంటికి పోగానే యశోద ఖంగారు పడింది.

'రైలుస్టేషనుకు పోయి .... పాముల నరసయ్యగారో ఎవరో ఉంటారుట .... మంత్రం వేయించు వాయనా' అంది యశోద.

'కాలికి కట్టు కట్టండి' అన్నాడు రమణ.

'ఆపని నేను చూస్తాను. ముందు మీరు స్టేషనుకు పదండి' అంది విమల. రమణ స్టేషనుకు పరుగెత్తాడు..

విమల కట్టు కట్టింది. యశోద వేన్నీళ్ళు కాగబెట్టటానికి దొడ్లోకి పోయింది. విమల మంచం దగ్గరకు వచ్చింది. జోగారావు ఆమెను ఒక్కసారిగా రెండు చేతుల్తోనూ పట్టుకుని మంచంమీద కూర్చోబెట్టాడు. విమల తత్తరపాటు సర్దుకుంది.

''నాకు భయంగా ఉంది....' అన్నాడు జోగారావు.

''మీకు భయంలేదు' అంది విమల.

''ఓదార్చటానికి అంటున్నారు .... బ్రతుకుతానని ఆశ లేదు, నాకు .... ఇలాంటి దుర్మరణం వస్తుందని ఎన్నడూ అనుకోలేదు. నా ఆశలన్నీ మొదట్లోనే తెగిపోతున్నయి..... అబ్బా' మూలుగుతున్నాడు జోగారావు.

'మీరు చదువుకున్నవారు .... అలా బెంబేలు పడితే ఎలా ? ధైర్యంగా ఉండాలి ....' విమల తన పిరికితనాన్ని కప్పిపుచ్చుకుంది.

'చదువుకీ, జీవన్మరణాలకి సంబంధం ఏమిటి ? ఇంకా కొన్ని నిముషాలు నా ఈ జీవితం .... చివరి ఘడియల్లో మీరు నాదగ్గ రున్నారు అంతేచాలు.'

'అంటే' తెల్లబోయింది విమల కొద్దిగా.

'నా మనసులో పూచిన పూలసౌరభం మీకు తెలియనే తెలియదు. మొదటిసారిగా మిమ్మల్ని చూచిననాడే .... మిమ్మల్ని గుర్తుపట్టాను నేను .... విమలా ....'

జోగారావు ఏకవచనంలో పిలిచినా విమల ఆశ్చర్యపడలేదు.

'విమలా .... ఇలా పిలుస్తున్నందుకు నన్ను క్షమించు. నువ్వు నా జీవితభాగస్వామినిగా గుర్తుపట్టాను. పెళ్ళిళ్ళు స్వర్గంలోనే అవుతాయని నాకు తెలుసు. కాని విధి నన్ను ఈవిధంగా వేరు చేస్తోంది. విమలా .... నన్ను క్షమించు....నిన్ను నా దాన్నిగా చేసుకోలేకపోతున్నను.''

విమల నోటివెంట మాట రాలేకపోతున్నది. ఆమె కళ్ళవెంట అప్రయత్నంగా నీళ్ళు కారటం మొదలుపెట్టింది.

'నీకుగూడా నేనంటే యిష్టమని తెలుసు. ఈ ఆఖరి క్షణాల్లో ఆమాట నీ నోటివెంట చెప్పు .... విమలా .... నీ సాన్నిధ్యంలో ఈ ఘడియల్లో నా బాధను మరచిపోతాను.''

విమల నిశ్చేష్టురాలైంది.

జోగారావు విమలను రెండు చేతుల్తో పొదివి పట్టుకున్నాడు. మూలుగును ఆపుకుంటూ కొంచెం పైకి లేచాడు. విమల శరీరం అంతా ప్రేమ స్వరూపమై ఉవ్వెత్తున పొంగింది. జోగారావు కౌగిలిలో అమరిపోయింది, ఆమె హృదయం.

'ప్రభూ .... నేను నీదాన్ని .... ఇంతదాకా గుర్తించలేకపోయాను.' అని మూగధ్వనులు చేస్తోంది. జోగారావు మళ్లీ మంచంమీదకు వాలిపోయాడు. విమల అతని ముఖంమీదకు వంగబోయి, యశోద రావడం గమనించి అతని నుదుటిమీద చెమటను చీరె కొంగుతో తుడిచింది.

'రమణ ఇంకా రాలేదు' అంది యశోద.

'ఈపాటికి వస్తూవుండాలి' అంది విమల.

'నువ్వు పోయి లోపల కొంచెం కాఫీ పెట్టు' అంది, యశోద.

విమల కాఫీ పెట్టుకుని వచ్చింది.

'ఎట్లా ఉంది ....' విమల అడిగింది.

'నీ ప్రేమతో నేను మృత్యువుని జయించగలను' అన్నాడు జోగారావు. విమల ఆ మాటలకు పొంగిపోయింది. అంత విశేషమూంది కాబోలు. తను ఎట్లా చెప్పగలదు ? ఏమని చెప్పగలదు ?

'కాఫీ తీసుకోండి కొంచెం.'

'నాలో ఎందుకు ఇలా ఉత్సాహంగా ఉంది. నువ్వే కారణం.'

'అక్కడ స్టేషనులో మంత్రం పెట్టటం అయి ఉంటుంది ....'

'నీమీద ఉన్న నమ్మకం .... నాకు ఆ మంత్రాల మీద లేదు.....'

రమణ చెమటలు కక్కుకుంటూ వచ్చాడు.

'ఎట్లాఉంది' నోట్లోనుంచి మాటలు రాక మునుపే జోగారావు ముఖంలో కళకళ కనబడింది. 'మంత్రం పనిచేసింది' అన్నాడు.

'అవును.....' అంది యశోద.

విమల, జోగారావుల ముఖాల్లో ఆనందం మొలకలెత్తింది.

'ఒక రిక్షా పిలిచి నన్ను ఇంటికి పంపండి' అన్నాడు జోగారావు.

'వీల్లేదు .... ఈ రాత్రికి ఇక్కడే ఉండాలి మీరు. ఇంత ప్రమాదంనుండి తప్పి .... ఎట్లా వెళదామనుకుంటున్నారు ....' యశోద మందలింపుగా అంది. 'పోనీ మీ ఇంట్లోవాళ్ళకి కబురు పంపుదాం' అంది.

'చెప్పి రమ్మంటావా ....' అయిష్టతగా అడిగాడు రమణ.

'అక్కడ ఎవరున్నారని .... ఒంటరిగాణ్ణి .... మావాళ్ళంతా గ్రామంలోనే ఉన్నారు. ఇంత ప్రమాదం వచ్చి తప్పిందని వాళ్ళకు తెలియదు...''

విషాదంగా నవ్వాడు జోగారావు. విమల వైపు చూశాడు. 'నువ్వు నాదానివి' అంటున్నాయిచూపులు.

విమల 'చూపులు 'నిజమే'....అంటున్నాయి.

జోగారావు పదిరోజుల తర్వాత శుభలేఖలకట్ట పట్టుకుని ఆఫీసుకు వచ్చాడు. రమణ శుభలేఖ చదివి నిర్ఘాంతపోయి తన ఆశ్చర్యాన్ని లోపలే కప్పిపుచ్చుకున్నాడు. 'కంగ్రాచులేషన్సు' అన్నాడు. 'వీడిలో ఏం చూసింది. విమలకోసం నేను ఏమయినా చేసేవాణ్ణి.... నావిలువ గ్రహించుకోలేకపోయింది' అనుకున్నాడు లోపల. 'ఈ జోగారావుగాడిలో ఏం చూసింది?' అన్న ప్రశ్న అతనిలోఅనేకసార్లు ఉదయించింది. విమల ఆఫీసుకురావటం మానేసింది. రమణ వాళ్లింటికి పోదలచుకోలేదు.

ఆరోజు విమల, జోగారావు, యశోద కలిసి రైలులో జోగారావు వాళ్ళ ఊరు బయలుదేరారు. పెళ్ళి అక్కడే జరిగే ఏర్పాటు.

రైలు బయలుదేరింది. రమణ ప్లాటుఫారం మీద నిలబడ్డాడు. రమణకు జరిగిన సన్నివేశాలు అనేకం గుర్తుకు వచ్చినాయి. ఆరోజు పార్కులో విమలతోపాటు వంటరిగా కూర్చున్నప్పుడు .... తనేమన్నా పొరపాటుగా ప్రవర్తించాడా ? అనుకున్నాడు. తను పిరికివాడిలాగా ఎందుకు మసిలాడు ? తను చేసిన పొరపాటు అదేనా !

జోగారావు పోతున్న రైలులో నుంచి చెయ్యి ఊపుతున్నాడు. అతని చేతిలో ఏమిటో వేళ్లాడుతోంది. తాడులాగా ఉంది. దూరం నుంచి పాములాగా కనబడుతోంది.

'ఏమిటండి .... అది' అంది విమల కిటికీలో నుంచి బయటకు చూస్తూ. 'రబ్బరు పాములాగా ఉందే ....' అంది.

'అవును.'

'మీ కెక్కడిది ....?'

'మరి నన్ను పార్కులో కరిచినపాము ఇదేగా ?' అన్నాడు జోగారావు. విమల విస్తుబ్బరాలైంది. ఉక్రోషం వచ్చింది. అయితేనేం ఆ ఉక్రోషం మధురాతిమధురంగా ఉందివిమలకు. ☆

ఆరోజు రాత్రి నాటకం వేసిన నటుడు తన స్నేహితుడితో ఇలా చెబుతున్నాడు.

"నేను ఈనాటినుండి నాటకాల్లో వేషాలు వెయ్యడం మానుకుంటున్నాను. ఇవ్వాళ్టినుండి పెద్ద చెప్పుల కంపెనీ పెట్టబోతున్నాను."

కర్లపాలెం మధుసూదనరావు.
(వేటపాలెం)